కథ

సీటు దొరికితే...

నంబూరి పరిపూర్ణ

ఫైనల్ ఎం.ఎ. ఆఖరు పేపరు ఆన్సరు చేసిన సునీతకు కొండంత బరువు దిగి పోయింది. రేపట్నించీ శలవులు. తనూ ఆంధ్రా యూనివర్సిటీ నించి శాశ్వతంగా శలవు తీసుకోవాలనే నిజం మనసును మెత్తగా కోస్తున్నది.

బడుగు వర్గపు నిరుపేద బాలిక సునీత. ప్రభుత్వం అందించిన ఉచిత విద్యా బోధన, విద్యార్థి వేతన సౌకర్యాలతో చదువుకుంటూ వచ్చింది. ఐదేళ్ల పాటు యూనివర్సిటీ హాస్టల్లో నిశ్చింతగా గడిచింది.

దేశమంతరికీ కాకపోయినా, తన ఊరునించీ, ఆ చుట్టుపల్ల నించీ బతుకుదెరువు కోసం వచ్చే కుర్రాళ్లకి ముందుగా తనింట్లో ఆశ్రయమిచ్చి, ఏదో ఒక పనిలో, వృత్తిలో వాళ్లు కుదురుకునేట్టు సహాయ పడుతూ, తృప్తి పొందుతుంటాడు రామ్మోహన్. ఒకానొక ప్రభుత్వ రంగ సంస్థ పర్సనల్ ఆఫీసరు శ్రీ ప్రసాద్‌గారితో అతనికి ఏర్పడిన పరిచయం ఆత్మీయతగా మారి ఎందరో యువకులకు 'అన్నం' పెట్టింది.

సునీతను కూడా ఆ ప్రసాద్‌గారి వద్దకే తీసికెళ్లాడు రామ్మోహన్. "అమ్మాయి మా కజిన్ బ్రదర్ కూతురండీ. ఆయన మా ఊరు మాస్టరుగా చేస్తు సునీత చిన్నతనంలోనే పోయాడు. ఆయనకి కూతుర్ని గొప్పగా చదివించాలనే బలమైన కోరికుండేది. అక్షరమ్ముక్కారాని మా ఒదినె కాయకష్టంతో బిడ్డను ఎం.ఎ. వరకూ చదివించుకుని మా అన్నయ్య కోరిక నిజం చేసింది. ఇప్పుడావిడ రోగంతో మూలబడిపోయింది. మీ పూనికతో మీ కార్పోరేషన్లో సునీతకేదైనా జాబ్ దొరికితే తల్లీ బిడ్డా బతికి పోతారు సార్!" అంటూ చేతులెత్తి నమస్కరించాడు రామ్మోహన్.

* * *

జంకుతూ జంకుతూ ఎం.డీ. గారి ఛాంబర్సులోపలికొచ్చి ఆయనకి నమస్కరించి తలొంచుకు నించుంది సునీత.

భాస్కర్ ఆమెనలా చూస్తూండి పోయాడు. చాలా అందమైన పిల్ల. వాలిన కనురెప్పలు కవులు వర్ణించే కలువరేకుల్లా వున్నాయ్. ముద్ద బంతిపువ్వులాంటి ముఖం!

చటుక్కున భార్య రూపం కళ్లల్లో మెదిలింది. ఆమెది లోతుగా, చుక్కలా వున్న కళ్లు. పెదవులు మూతబడని ఎత్తుపళ్లు. నల్లగా మొరటుగా వుంటేనేం లక్షలు ఎరజూపి తనని అల్లుణ్ణి చేసుకున్నాడామె తండ్రి. ఆరడుగుల ఎత్తూ, అందమైన కనుముక్కుతీరూ ఎంతో హుందాతనం వున్నతనకు ఆమె తగిన జోడీ కాదు. అయినా పరిస్థితులకి తలవంచి కాపురం సాగిస్తున్నాడు. ఇద్దరు బిడ్డల తండ్రి కూడా అయినాడు తను.

భార్య తనకీమాత్రం తగింది గాదనే అసంతృప్తి భాస్కర్‌ని అనుక్షణం దహిస్తూ వుంటుంది. అందమైన ఆడవాళ్లు కనబడితే, ఆబగా చూస్తాడు. వీలు దొరికితే వలలు విసురుతుంటాడు. గాలాలు వేస్తుంటాడు. అతని అందమూ, ఆకర్షణా, అధికార హోదాలకి ప్రలోభపడే చేప పిల్లలు అడపా దడపా చిక్కుకు పోతూ వుంటాయి.

"ఆ... ఏ ఊరమ్మా మీది? కూర్చోండలా" ఎట్టకేలకు పలకరించాడు.

"పెదపూడి సార్! పశ్చిమ గోదావరి జిల్లా" కూర్చుంటూ చెప్పింది సునీత.

"ఆహా... నరసాపురం అవతలదేనా?"

"అవున్సార్! అదే" ఎం.డీ. గారు తన ఊరును గుర్తించారని ఆనంద పడి పోతూ అంది సునీత.

"తండ్రి లేరటగదూ మీకు?"

"లేరండీ! ఆరేళ్ల క్రిందట చనిపోయారు."

"అన్నదమ్ములెవరైనా ఉన్నారా?"

"ఎవరూ లేరుసార్. మా అమ్మ తప్ప యింకెవరూ లేరు నాకు."

భాస్కర్ బజ్జర్ నొక్కాడు. "జీ సాబ్!" అంటూ అటెండర్ వచ్చాడు.

"సెక్షనాఫీసర్ గార్ని పిలుచుకురా" అని హుకుం యిచ్చాడు. రెండు నిమిషాల్లో సెక్షనాఫీసర్ వచ్చి వాలగానే "మీ సర్టిఫికెట్లు ఈయనకివ్వండి. వెరిఫై చేస్తారు" అని సునీతకు చెప్పాడు. ఆమె సర్టిఫికెట్లున్న కవరు సెక్షనాఫీసరుకందించింది.

తన సీటు దగ్గరికి చక చకా పరిగెట్టి ఐదు నిమిషాల్లో సర్టిఫికెట్లన్నీ వెరిఫై చేసి, తరిగి పట్టుకొచ్చి "డిగ్రీ సర్టిఫికెట్టూ, టైపు హయ్యర్, షార్టు హాండు లోయర్ పాసయిన సర్టిఫికెట్లున్నాయి సార్! అన్నీ వెరిఫై చేశాను" అన్నాడు సెక్షనాఫీసర్ ఎం.డీ. గారితో.

"సరే మంచిది. ఆ మధ్య మనాఫీసులో రెండు క్లెరికల్ వేకెన్సీలు ఎరైజ్ అయ్యాయి గదూ."

"మరే సార్! స్టడీ లీవు మీదెళ్లిన కుర్రాళ్లిద్దరూ నిన్నొచ్చి జాయినయ్యారు సార్. తమకొచ్చి కనబడదామని వాళ్లనుకుంటుండగా, తమరు బయటికెళ్లిపోయారు. జాయినింగ్ రిపోర్టులు ఈ రోజు టపాలో మీకు పంపాను సార్!"

"అరె! అలాగా! టపా నేనింకా చూళ్లేదు లెండి" అని సునీత వైపు ఎంతో నొచ్చుకుంటూ చూస్తూ" ఏమ్మా మా దగ్గరున్న ఖాళీలు భర్తీ అయిపోయాయి మరి. ప్రస్తుతం నిన్ను అప్పాయింటు చెసుకుందుకు వీలు కనబడ్డం లేదు. కానీ పాపం... వెంటనే జాబ్ చెయ్యాల్సిన పరిస్థితి నీది. ఎలా... ఎలా సహాయపడేది నీకు..." అని మథన పడుతూ సెక్షనాఫీసరుకు యింక మీరెళ్లచ్చునన్నట్టు తలవూపాడు ఎం.డీ.

సునీత ముఖం ఒక్కసారిగా కళా విహీనమయ్యింది. నీళ్లూరుతున్న కళ్లను దించుకుని నేలమీది కార్పెట్‌నే చూస్తూ వుండిపోయింది. అది గ్రహించి భాస్కర్ "చూడమ్మా! దిగులు పడకు. మా దగ్గర గాకపోతే వేరెక్కడైనా నీకు జాబ్ చూపిస్తాను. నువ్వు మాత్రం రెండ్రోజులకో మాటు వచ్చి ప్రయత్నాలెంత వరకొచ్చినాయో తెలుసుకెడుతూ వుండు. ఏం?" అన్నాడు భాస్కర్.

క్రుంగి పోతున్న సునీత మనసుకి అతని మాటలు ఏనుగంత బలాన్నిచ్చాయి. దిక్కులేని తన బోటి దానికి తప్పకుండా జాబ్ చూపిస్తానని భరోసాయిస్తున్న ఆ గొప్ప ఆఫీసర్ పట్ల అపారమైన కృతజ్ఞత కలిగింది సునితకు.

"తప్పక వస్తాసార్! ఎందుకు రాను సార్! థ్యాంక్యూ వెరీ మచ్‌సార్." తత్తరపడుతూ హృదయపూర్వకంగా నమస్కరించి శలవుతీసుకుంది సునీత.

* * *

రెండ్రోజులకోమాటు వచ్చి భాస్కర్‌కి కనబడుతోంది సునీత. ఆమెను చూస్తూనే భాస్కర్ ముఖం విప్పారి ప్రసన్నమవుతోంది. గుండెల నిండా వింత ఉత్సాహం నిండుతోంది. తన అంతస్థును, దర్పాన్ని మరిచి పోతున్నాడు. చాలా కలుపుగోలుగా మాట్లాడుతున్నాడు. లంచ్ అవర్లో టిఫిన్లూ, టీలు వస్తున్నాయి. సునీత మొహమాటంతో, సిగ్గుతో టిఫిన్ ముట్టక పోతే "చూడమ్మా! చాలా ఆకలిగా వుంది నాకు. నువ్వూ ఉదయమనగా ఏదో యింత తినొచ్చుంటావు. కంపెనీ కోసమైనా టిఫిన్ తీసుకో సునీతా! ప్లీజ్!" అంటున్న అంత గొప్ప ఆఫీసర్ని ఎలా కాదనేట్టు!

పదిహేను రోజులు గడిచాయి. భాస్కర్ సునీతల మధ్య ఒక విధమైన స్నేహ సంబంధం నెలకొన్నది. ఆ క్రితం రోజు భాస్కర్ చెప్పినట్లుగా పదకొండు గంటల కొచ్చింది సునీత.

సునీతను కూర్చోమని కళ్లతో చెప్పి అప్పటి వరకూ మాట్లాడుతుండిన విజిటర్స్‌తో మళ్లీ సంభాషణ కొనసాగించాడు భాస్కర్. మధ్య మధ్య ఫైల్సు చూచి, సంతకాలు పెట్టి ట్రేలలోకి విసురుతున్నాడు.

విజిటర్స్ వెళ్ళిపోయి, ఫైల్స్ చూడటం పూర్తయ్యాక విశ్రాంతిగా ఒళ్ళు విరుచుకుని నవ్వుతూ "ఏం సునీత గారూ! బాగా బోరు కొట్టిందాండి. ఏం చెయ్యను మరి. పేరుకున్న అర్జంటు ఫైల్సన్నీ వదిలించేశానివ్వాళ. వాళ్లేమో బడా ఇండస్ట్రియలిస్టులు. మాట్లాడక తప్పలేదు" సంజాయిషీలా అన్నాడు భాస్కర్.

సునీత గౌరవపురస్సరంగా, అభిమానం ఉట్టిపడేలా నవ్వింది.

భాస్కర్ చటుక్కున అంతర్ముఖుడయి, మనసులోని కలగా పులగపు ఆలోచనలు ఒక నిర్దిష్ట రూపానికి రావడంతో, హుషారుగా భుజాలెగరేసి, సిగరెట్ ముట్టించి, "మిస్ సునీతా! నీకో మంచి వార్త చెప్పబోతున్నాను. నా బూజమ్ ఫ్రండొకరు వెల్‌ఫేరు డిపార్టు మెంటుకి డైరెక్టరు. నిన్న అతన్తో నీ విషయం మాట్లాడి సహాయపడమని అడిగాను. లక్కీగా అతని దగ్గిరి స్టెనో పెళ్ళి చేసుకుని జాబ్కి రిజైనివ్వడం వల్ల ఖాళీగా వుందటాపోస్టు. మరి నువ్వు షార్టుహేండ్ లోయర్ మాత్రమే పాసయినా, ఆ పోస్టులో నిన్ను వేసుకోక తప్పదనీ, వచ్చే హైయర్ పరీక్ష నువ్వు ప్రిపేర్ అయి పాసవ గలవనీ నచ్చజెప్పాను. ఒకసారి నిన్ను కూడా ఆయనకి పరిచయం చేస్తే బాగుంటుందనిపిస్తున్నది."

"అలాగే సార్! మరెప్పుడు తీసికెడతారు వారి దగ్గిరికి నన్ను."

"రేపతను క్లబ్బుకొస్తానని చెప్పాడు. నువ్వక్కడికి రా. రేపు నాలుగ్గంటల ప్రాంతంలో అమీర్‌పేట బస్టాపులో నిలబడుండు. పికప్ చేసుకుంటాను. అసలు నిన్నిక్కడికే రమ్మనొచ్చు గానీ కార్లో మనిద్దరం బయల్దేరితే స్టాఫ్ ఏడుస్తారు. మరి అక్కడ వెయిట్ చేస్తావు గదూ!" అన్నాడు భాస్కర్.

తప్పక నాలుగ్గంటల కక్కడుంటాను సార్! ఇంత శ్రమ తీసుకుంటున్న మీకు ఎలా కృతజ్ఞత చెప్పాలో తెలియడం లేదు.

"తెలియనక్కర లేదులే. అవసర మయినప్పుడు చూపించుదువు గాని. విష్ యూ బెస్ట్ ఆఫ్ లక్."

* * *

మెత్తగా, హాయిగా కారును నడుపుతున్నాడు భాస్కర్. సునీత కిటికీల్లోంచి రక రకాల గాపుల అందాలను పరికిస్తోంది.

"అలా ముఖమంతా బయట బెట్టి చూడకు సునీతా! నన్నెరిగిన జనం చాల మందుంటారిక్కడ. ఎవరో అమ్మాయితో కార్లో పోతున్నానని మా ఆవిడకు చెప్పారంటే మా ఇంట్లో కనీసం వారం రోజులు జరుగుతుంది యుద్ధం. అసలు నువ్వలా కూర్చోకు. శుభ్రంగా సీట్లో వాలి పడుకో." అన్నాడు భాస్కర్.

భాస్కర్‌కి కలగబోయే యిబ్బందిని అర్థం చేసుకుందుకు సునీత ప్రయత్నిస్తున్నప్పటికీ సీట్లో వాలడానికిష్టమవడం లేదామెకు. భాస్కర్ మళ్లీ హెచ్చరించడంతో వాలి పడుకుంది.

మెయిన్ రోడ్డు వొదిలి కొంత సేపు ఏవో గల్లీల వెంట పరిగెట్టి సిటీ లిమిట్స్ దాటాక మళ్లీ హైవే వెంట పోతోంది కారు. అలా పోయి పోయి ఒక గేట్లోంచి వెళ్ళి గెస్టు హవుసు ముందాగింది.

భాస్కర్‌తో పాటు కారు దిగిన సునీత చుట్టూ వున్న పార్కును ఆశ్చర్యంగా చూస్తూ "క్లబ్బుకన్నారుగా పార్కుకొచ్చారేమిటి?" అని అడిగింది.

"ఆ... ఆ... మరే. వెన్యూ మారినట్టు నీకు చెప్పలేదు గదూ! ప్రొద్దున మా ఫ్రెండు ఫోను జేసి ఇవ్వాళ క్లబ్బుకొద్దు. ఊరు బయటికెక్కడికైనా వెళ్ళి శుభ్రమైన గాలిమేద్దాం. నాల్రోజుల నించీ పనితో నలిగి పోతున్నాను అన్నాడు. క్లబ్బులో జనం మధ్య కంటే యిలాంటి చోట నిన్నతనికి పరిచయం చెయ్యడం మంచిదనిపించింది నాక్కూడా.

పావుగంటలో అతనొచ్చేస్తాడు. అందాకా గెస్టు హవుసులో కూర్చుందాం పద." అంటూ గెస్టు హవుసు మెట్లెక్కసాగాడు భాస్కర్. సునీత అనుసరించింది. ఇద్దరూ హాల్లో సోఫాలమీద ఆసీనులయ్యారు.

ఇంతలో "ఆవ్ ఆగయే హుజూర్!" అంటూ సంబరంగా పలకరించాడు వాచ్‌మన్. "ఆ... ఆ... యిప్పుడే వచ్చాం" అంటూ ఊర్దూలో ఏదో చెప్పాడతనికి భాస్కర్. వాచ్‌మన్ వెంటనే హాల్లోంచి వెనక రూములోకెళ్ళి తలుపు తెరిచి, ఫ్లాస్కు చేతబట్టుకొచ్చే సరికి ఏభై రూపాయిల నోటందించాడు భాస్కర్! "అచ్ఛా! మై అభీ ఆయా! ఆప్ ఆరామ్ లీజియే" అంటూ బయటికి పోయాడు వాచ్‌మన్. బయటికెళ్ళాక హాలు తలుపులు మూసిన సంగతి కిటికీ లోంచి రంగు రంగుల గులాబీలను తన్మయంగా చూస్తున్న సునీత గమనించలా. తరువాత ఒక్కసారిగా హాలు చీకటయినట్టు గమనించి "ఏమిటి సార్! తలుపులు మూసి పోయినట్టున్నాడే వాచ్‌మన్?" అంది ఖంగారుగా.

"పార్కులోకి జనం వచ్చే సమయమయ్యింది గదా! మనకి డిస్టర్బెన్సని తలుపులు వేసుంటాడు. ఖంగారు పడతావెందుకు?" చిలిపిగా సునీత కళ్లలోకి చూస్తూ అన్నాడు భాస్కర్.

సునీతకి అంతరాంతరంలో ఏదో శంక! భయం!!... ఆ డైరెక్టరు బాబు ఎప్పుడొస్తాడో అని ఆదుర్దాగా ఎదురు చూస్తోంది.

"సునీతా!" మంద్రంగా మధురంగా పిలిచాడు భాస్కర్. తలెత్తి అతని ముఖంలోకి చూసే సరికి స్వచ్ఛత, గాంభీర్యానికి బదులు, మీగడ పిడత ముందు కూర్చున్న పిల్లిలా కనబడ్డాడతను.

"సునీతా! వారానికల్లా నువ్వు వెల్‌ఫేరు డైరెక్టరు గారి స్టెనోవయిపోతావ్. ఏదో లాంఛనంగా నిన్ను పరిచయం చెయ్యబోతున్నాను. ఎంప్లాయిమెంటు నించి నీ పేరు స్పాన్సరయ్యేట్టు ఏర్పాటు చేశా. రేపట్నించీ బంగారు బాటలోనే నువ్వు నడిచేది. మరి... మరి... నాకేమిటీ బహుమతి?"

"బహుమతికేం సార్! నా మొదటి జీతంతో మీ శ్రీమతి గారికి పట్టుచీర కొని పెడతాను. ఫైవ్‌స్టార్ హోటల్లో మీ యిద్దరకూ డిన్నరిస్తాను. పేదదాన్ని యింతకు మించి యివ్వలేను."

"కష్టపడి, ఉద్యోగం వేయించేది నేనైతే మధ్యలో ఆవిడకా బహుమతి!"

"పోనీ మీకే యిస్తాలెండి. మంచి సఫారీ సూట్ కేసు కొనివ్వనా?"

"మా ఇంట్లో లేవేమిటి బోలెడు ఫారెన్ సూట్‌కేసులు."

"పోనీ మీరే చెప్పండి సార్. మీకేం కావాలి."

"నాక్కావలసింది నువ్వే సునీతా! మరేమీ వద్దు."

తలమీద పిడుగు బడ్డట్టు అదిరి పడింది సునీత. నోరు తడారి పోయి, మాట పెగలక, గుడ్లురుముతూ చూచింది.

"నిన్ను చూచిన క్షణం నించీ, నాకేదో పిచ్చి పట్టింది. నిన్ను పొందలేని జీవితం వ్యర్థమనిపిస్తున్నది."

"దిక్కులేని నాకు సహాయ పడుతున్నావనుకున్నా. దాని వెనుక యింత నీచమైన కోర్కెవుందా? అందుకే పన్నాగం పన్ని నన్నిటు తీసుకు వచ్చావా? ఎంత దగా! నువ్వు నన్ను చంపగలవేమో గానీ, నా శీలాన్ని మాత్రం హరించలేవు" అంటూ బుసలు కొడుతూ లేచి నిలబడింది సునీత.

ఆమె మాట పూర్తి కాకముందే మెరుపులా లంఘించి, తన రెండు చేతుల మధ్య నామెను కదలకుండా ఒడిసి పట్టుకుని వెనక రూములోకి ఒక్క దూకు దూకి తలుపులు మూశాడు భాస్కర్.

సునీత ఆర్తనాదాలన్నీ అరణ్య రోదనాలు! అడవి దున్న ముందు జింక పిల్ల చేయగలిగిందేమిటి!

* * *

ప్రథమ సంతానంగా పుట్టిన కూతురుకి అమూల్య అని ముద్దుగా పేరుబెట్టుకున్నాడు భాస్కర్.

ఉమెన్స్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న అమూల్య సాయంత్రం నాలుగింటికల్లా ప్రాక్టికల్స్ పూర్తి చేసుకుని ఇంటికెళ్ళేందుకు గేటు వద్దకొచ్చి ఆటో కోసం చూస్తోంది. అప్పటికే మబ్బులు గమ్మివున్న ఆకాశం నించి పెద్ద పెద్ద చినుకులు టప టప రాలసాగాయి. అమూల్య చటుక్కున ఒక ఆటోలోకెక్కి తమ కాలనీ పేరు, ఇంటి గుర్తులూ డ్రైవర్‌కి చెప్పి త్వరగా పోనివ్వమని తొందర బెట్టింది.

ఆటో స్పీడుగా పరిగెడుతూ ముందున్న చౌరస్తా కివతలగా నిలబడి పోయున్న వాహనాల తోరణం వెనుక గబుక్కున ఆగిపోయింది.

బస్సులు, లారీల మధ్య నించి అప్పుడు వదిలిన స్కూళ్ల పిల్లలు, బాటసారులు వర్షంలో రోడ్డును దాటే ప్రయత్నం చేస్తూ గగ్గోలుగా అరుస్తున్నారు. రాను రాను వర్షపు జోరు ఎక్కువ కాసాగింది. కారు మబ్బులు మరింతగా కమ్ముకొస్తూ వీధుల్ని చీకటితో నింపుతున్నాయి.

పావుగంట గడిచాక ట్రాఫిక్ పలచబడి అమూల్య కూర్చున్న ఆటో మళ్లీ కదిలి పరుగు బెట్టింది. వాన జల్లు పడకుండా రెండు వైపులా తెరల్ని దించాడు డ్రైవర్.

ప్రాక్టికల్స్ చేసి అలిసి పోయి వుండడంతో ఇంటికెప్పుడు చేరి బెడ్ మీద పడదామా అని అనుకుంటోంది అమూల్య, చిరు జల్లుల చల్లని గాలికి. ఆటో ఎక్కిన వెంటనే ఆమెకి మగతగా కళ్లు మూతలు పడ్డాయి. డ్రైవర్ వెళ్లవలసిన దారి వొదిలి యూనివర్సిటీ వైపుకి ఆటో నడుపుకు పోసాగాడు. కాంపస్‌లోని మెయిన్ రోడ్డు మీంచి, మరో సన్నటి మెటల్ రోడ్డు మీదుగా రామంతపూర్ చేరువకి తీసికెళ్లి హఠాత్తుగా బండాపి "దిగు" అని గట్టిగా అరిచాడు డ్రైవర్.

మొరటుగా కర్కశంగా వున్న అతని అరుపుకు ఉలిక్కిపడి ఆటోలోంచి దిగింది అమూల్య. అరె... ఇదేమిటి? తమ బంగళా, గేటూ ఏవి? ఈ కొండరాళ్లు, ముళ్ల పొదలూ ఏమిటి? చీకట్లు ముసుగుతున్న ఆ నిర్మానుష్య స్థలంలో భయంతో కొయ్య బారి నిలబడింది అమూల్య.

ఆటోవాడు అమూల్య ఓణీని లాగి పారేశాడు. జాకట్టు వెనుక మెడలోకి నవేళ్లు పోనిచ్చి చ్ఛిద్రుల చించాడు. ఏం జరుగబోతున్నదో గ్రహించి, రెండు చేతుల్లో వాణ్ణి చెలుగుతోంది అమూల్య. కంఠనాళాలు తెగేట్టు అరుస్తోంది. వాడు రెచ్చిపోయి, బలంగా ఒక్కతోపుతోసే సరికి ప్రక్కనున్న బల్లపరుపు బండ మీద పడిందమూల్య. పిచ్చెక్కిన ఏనుగులా ఆమె మీద దభీమని పడ్డాడు వాడు!

చీకటి మరి కాస్త చిక్కబడ్డాక ఆమెనాటోలో పడేసుకుని బస్టాపు దగ్గిరగా ఎవరూ చూడకుండా వదిలి అదృశ్యమైనాడు ఆటోవాడు.

సిగ్గుతో భయంతో గజగజలాడ్తూ బస్సులో పడి రాత్రి ఏడింటికి ఇంటికి చేరి, తల్లిని కావలించుకుని గుండెలు బద్దలయ్యేలా ఏడ్చింది అమూల్య. తల్లి నెమ్మదిగా బతిమాలగా జరిగిన సంఘటన చెప్పి మళ్లీ భోరుమంది అమూల్య.

* * *

సాటి ఆఫీసర్లతో 'బారులో' ఖుషిగా గడిపి పన్నెండింటికి ఇల్లు చేరిన భాస్కర్ భార్య చెప్పిన సంగతి విని నిలువెల్లా ఒణుకుతూ తూలి పడబోతుండగా భార్య కాంతిమతి నెమ్మదిగా బెడ్‌మీదికి చేర్చి ప్రక్కనే కూర్చుని ధైర్యం చెప్పసాగింది. అశ్రుధారలతో తడిసి పోతున్న భర్త చెంపల్ని మాటి మాటికీ చీర కొంగుతో తుడుస్తోంది.

భాస్కర్ మస్తిష్కం ఆలోచనల వేగానికి అదిరిపోతోంది. తనెంతో ప్రేమించే తన అమూల్య! అమాయకతా, పవిత్రతా నిండిన పసిమొగ్గ, ఎంతటి భయంకరానుభవానికి బలయ్యింది! పులి పంజాకి చిక్కిన లేడి కూనలా గిల గిల కొట్టుకుంటూ ఎంత బెదిరి పోయిందో నా తల్లి!

ఎంత మదం ఈ ఆటోవాళ్లకి! చదువా సంధ్యా, వెధవలకి. చేతిలోకి నాల్గు పైసలొస్తే చాలు సెక్సు సినిమాలు పదిసార్లు చూస్తరు. రోడ్ల మీద కనిపించిన ఆడపిల్లల్ని ఎత్తుకు పోయి పాడుచేస్తుంటారు కిరాతకపు లఫ్డీకొడుకులు!

అదే క్షణంలో మెరుపు మెరిసినట్లు సునీత ముఖం భాస్కర్ కళ్లకి కనబడింది. పాపం ఆ రోజు అంత జరిగినా బతికే మార్గం మరోటి లేక తను సిఫారసు చేసిన జాబ్‌లోనే చేరి పనిచేస్తోంది సునీత. అందుకు తనామెని ఎంత చులకనగా భావించాడు. గెస్టు హవుసులో ఆమె ప్రదర్శించిన పౌరుషం జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఎంత నవ్వుకునే వాడు తను.

కానీ సునీతగానీ! తన అమూల్య లాంటి పిల్లలు గానీ పశు బలం ముందు నంజెయ్యగలరు? అనుక్షణం తన మనోఫలకమ్మీద ప్రత్యక్షమవుతూ "ఏం పెద్ద మనిషీ! బాధపడుతున్నావా? గొప్ప చదువూ, సంస్కారముండీ ఆపదలో నీ సహాయ మర్థించే ఆడపిల్లల శీలాల్ని బలి తీసుకునే నువ్వు ఆ వేమీ లేని రౌడీలు అమూల్య లాంటి పిల్లల మానాల్ని హరించడాన్ని ఎందుకు భరించలేవు? వాళ్లకన్నా నువ్వేం మెరుగు?" అంటూ సునీత నిగ్గదీస్తుంటే ఏం జవాబు చెప్పాలి తను?

* * *